క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రం లోని రైతు వేదికలో నేడు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పున్నం లక్ష్మీరవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల సభకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

గుడుంబా స్వాధీనం



టేకుమట్ల(రేగొండ): అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను ప్రొహిబీషన్, ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రేగొండ మండలంలోని కొత్తపల్లి ఎక్స్‌రోడ్‌తో పాటు, మండలంలోని నారాయణపూర్ శివారులో స్వాధీనం చేసుకున్నటుల ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని రామన్నగూడెం తండాకు చెందిన బానోతు చందులాల్ నుంచి ఆరు లీటర్లు, ఇంచన్ చెరువుపల్లికి చెందిన బానోతు యాకు నుంచి 16 లీటర్ల గుడుంబాను ద్విచక్ర వాహనాలపై రేగొండకు తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుడుంబాను, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ రఘుపతి, కానిస్టేబుళ్లు విష్ణు, అలీ, ముజఫర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మొగుళ్లపల్లి: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జనసేన నాయకుడు ఆకుల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియచేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సురేందర్, సలీం, మహిపాల్, మల్లికార్జున్, మనోజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పంగిడిపల్లిలో పలు కారణాలతో మృతి చెందిన ఊర కుమారస్వామి, బొమ్మ శివాజీ కుటుంబ సభ్యులను ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీలు ఆది రఘు, పెరుమాండ్ల మొగిళి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

అన్నదానం

భూపాలపల్లి రూరల్: ఆత్మీయత సేవా సొసైటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన స్వరూప -రాజు దంపతుల కుమారుడు శ్రీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం(హెచ్‌ఎంఆర్‌డీఎస్)లోని విద్యార్థులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమ్య, శ్రీకాంత్, రంజిత్‌కుమార్, శ్రావణ్ కుమార్, సొసైటీ సభ్యులు మహేందర్, షాకీర్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం



ఆత్మకూరు : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని గుడెప్పాడ్, కొత్తగట్టు, మల్కపేట, పెద్దాపూర్, లింగమడుగుపల్లె, నాగయ్యపల్లె గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గడచిన తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో చేపట్టిన పాలనను ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. ఈ సందర్భంగా విజయ్ చందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం ప్రజలను విస్మరించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని, దళి తులకు భూ పంపిణీ సహా అనేక హామీలు, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, తదితర అమలు చేయలేదని తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు సుపరిపాలన అందుతుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చైతన్యవంతం చేసి రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

దాతల సాయం మరువలేనిది



చెల్పాకలో సరుకులు అందజేస్తున్న నాయకులు



అల్లంవారిఘణపురంలో..



ఎస్ఎస్‌తాడ్వాయి



ఏటూరునాగారం: సామగ్రి అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

ఏటూరునాగారం: వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన దాతల సాయం మరువలేనిదని కాంగ్రెస్‌పార్టీ బ్లాక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండలంలోని చెల్పాక, బన్నాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల్లోని వరద బాధితులకు ఎమ్మెల్యే సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లు నీట మునిగి బాధిత కుటుంబాలను పరామర్శించి కుటుంబాలకు ట్రస్టుల సహాయ సహకారంతో బియ్యం, పప్పు, నూనె వారం రోజులకు సరిపడ 9 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు ఎండీ రియాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, టౌన్ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, వర్కింగ్ టౌన్ సరికొప్పుల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, సర్పంచ్ పలక చిన్నన్న, సర్పంచ్ చింత సుమలత రమేష్, సర్పంచ్ చేల వినయ్, కుదురుపాక శ్రీనివాస్, కర్నె సత్యం, సోదారి రామయ్య, వసంత పుల్లక్క, వసంత శ్రీనివాస్, లక్కీ, నవీన్, రాంబాబు, లక్ష్మయ్య, మొండయ్య, సురేష్, సారయ్య, నర్సింహులు, ముతేష్, ఫారూక్, కిరణ్, లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాటి మనుషులుగా సహకరిద్దాం..

సాటి మనుషులుగా కష్టాలలో ఉన్న తోటివారికి సాయం చేసి సహకరిద్దామని భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఆదివారం కొండాయి గ్రామానికి సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ వెళ్లి వరద బాధితబాధితులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండాయి గ్రామం మొత్తం వరదలకు ఇళ్లు కూలిపోయి అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీంతో సర్వర్ చారిటబుల్ ట్రస్ట్–ఫౌండేషన్ ఆధ్వర్యంలో 160 వరద బాధితులకు సామగ్రి బిందెలు, బకెట్లు, జగ్గులు, దోమతెరలు తదితర సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. తస్లీమా వెంట ట్రస్టు సభ్యులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎస్ఎస్ తాడ్వాయి: వరద బాధితులపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని కొండపర్తి, లావాణ్ల గ్రామంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చిన మంత్రులు ఇప్పటి వరకు ఒక్కరికీ పరిహారం అందించలేదన్నారు. ముంపు గ్రామాల్లో వరద బాధితుల పరిస్థితిపై ఒక్కసారి కూడా మంత్రులు పర్యటించి వారికి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యే సీతక్క పిలుపుమేరకు వరద బాధితులకు అండగా నిలుస్తున్న దాతలకు రుణపడి ఉండాలన్నారు. సర్పంచ్ ఇర్ప సునీల్, జిల్లా నాయకుడు ఆరెం లచ్చుపటేల్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు భూషణబోయిన రవికుమార్, నాయకులు ఈసం రమేష్, సీతారాములు, అనుమాళ్ల రాజిరెడ్డి, పాక రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కలుషితమవుతున్న తాగునీరు



ట్యాంక్ వద్ద లీకవుతున్న నీరు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న మంచినీటి ట్యాంక్ వద్ద నీరు లీకేజీ కావటంతో తాగు నీరు కలుషితమతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ట్యాంక్‌కు అధికారులు మిషన్ భగీరథ నీటిని ఎక్కించి పంచాయతీ ప్రజలకు తాగు నీరు అందిస్తున్నారు. కాగా ఈ ట్యాంక్ కింద పైప్ లైన్ లీకేజీ కావటంతో బురద నీరు పైప్‌లైన్‌లోకి వెలుతుందని దీంతో తాగునీరు కలుషితమౌతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించి తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

మల్హర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులపై అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. మండలంలోని కొయ్యూరు, తాడిచర్ల, దుబ్బపేట తదితర గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులపై అధికారులు ఇంటింటా విచారణ చేపట్టారు. మండల వ్యాప్తంగా 2590 గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 15 టీంలను ఏర్పాటు చేసి, ఈనెల 20 లోగా విచారణ చేపట్టి, ఉన్నాతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ శ్రీనివాస్, కార్యదర్శులు ప్రసాద్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చు అశోక్‌గుప్త

కాటారం: తిరుపతిలో జరగనున్న కోటి శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞంలో భాగంగా నిర్వహించనున్న ప్రచార రథయాత్రను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కాటారం శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్తా తెలిపారు. కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్ మండలాలకు చెందిన పలువురు హనుమాన్ భక్తులతో ఆదివారం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రచార రథయాత్ర రూట్ మ్యాప్‌పై చర్చించారు. ఈ సందర్భంగా బచ్చు అశోక్‌గుప్త మాట్లాడుతూ.. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి కోటి హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభం అవుతుందని ఇందులో భాగంగా ప్రచార రథయాత్ర మొదలవుతుందని పేర్కొన్నారు. తిరుపతి నుంచి బయలుదేరిన ప్రచారరథం జిల్లాల వారిగా పర్యటిస్తుందన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామాన్ని రథం సందర్శించేలా రూట్ మ్యాప్ తయారు చేసి నిర్వాహకులకు సమర్పించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రచార రథానికి ఘనస్వాగతం పలకడానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో హనుమాన్ భక్తులు దారం రమణయ్య, జంగ సమ్మయ్య, మోత్కూరి రవి, బాపురెడ్డి, సుధాకర్, రాజబాబు, లక్ష్మిరాజం, లక్ష్మయ్య, నారాయణ, బుచ్చయ్య, చిన్ననారాయణ, రాజయ్య, పెండ్యాల రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని వినతి



మంత్రి సత్యవతి రాథోడ్‌తో జిల్లా బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్‌బాబు)కు జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్ష పదవీ ఇవ్వాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ సత్యవతిరాథోడ్‌కు ఆదివారం జిల్లాలోని సుమారు 250 మంది బీఆర్ఎస్ నాయకులు విన్నవించారు. నాయకులు ఆయన వెంట ఉన్నట్లు వివరించారు. గ్రంథాలయ చైర్మన్‌గోవింద్‌నాయక్, నాయకులు చిన్నికృష్ణ, కూనూరు మహేష్, జిట్ట ఈశ్వర్, అల్లి శ్రీనివాస్, ఎంపీపీ అంతటి విజయ నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అప్పాల వారి వీధిలో పలువురు భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జీ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు జంపన్న సీతరామరాజు, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీలో చేరగా వారికి కండువాలు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, సంకహేమ సుందర్, వెంకటేశ్వర్లు, నర్సింహరావు, శివ తదితరులు ఉన్నారు.

ఎస్సైలను కలిసిన నాయకులు



ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భూపాలపల్లి ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సంధ్యారాణిలను స్వయం కృషి మున్నూరు కాపు సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు దేవరకొండ మధు, మేడ వెంకటస్వామి, జనరల్ సెక్రటరీ కొట్రంగి నాగార్జున, అధికార ప్రతినిధి సుంకరి గోవర్ధన్, కోశాధికారి సుధాకర్ సలహాదారులు సుధాకర్ ఉన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

శాయంపేట : రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని వసంతాపూర్, సూర్యనాయక్ తండా, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ‘ఇంటింటికి సంక్షేమ ఫలాలు’ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నాయకత్వంలో మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. అన్ని తరగతుల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాంశెట్టి లత, సర్పంచ్‌లు ముక్కెర అనూష ప్రేమ్‌సాగర్, శానం మంజుల పరమేశ్వర్, భూక్య రమేష్, పెంబర్తి సంతోష మల్లేష్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు రాంశెట్టి లక్ష్మారెడ్డి, ఇమ్మిడిశెట్టి రవీందర్, జాలిగపు అశోక్, కోసరి గోపాల్, రవీందర్‌రెడ్డి, ప్రతాప్, దేవ్ సింగ్, రాజు, రమేష భాస్కర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న హరిబాబు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 13వ పరిధి కాసింపల్లి గ్రామానికి చెందిన మోకిడి చిన్న అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు ఆదివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 13వ వార్డు కౌన్సిలర్ మంగళపల్లి తిరుపతి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అర్బన్ అధ్యక్షుడు మోకిడి అశోక్, వార్డు అధ్యక్షుడు గండి శ్రీనివాస్ గౌడ్, నాయకులు బేతు రమేష్, తూటి దేవేందర్, గండి చిరంజీవి, పూసల యుగేంధ్ర చారి, జోరు రాజ్ కుమార్, మోకిడి తిరుపతి, సురేష్, అశోక్, సంపత్, రమేష్ ఉన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



పరకాల: జాతీయ జెండాలతో కౌన్సిలర్ రాణి



శాయంపేట: గట్లకానిపర్తిలో..

పరకాల : ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించాలని 12వ వార్డు కౌన్సిలర్ బండి రాణి ఆకాంక్షించారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ కౌన్సిలర్లు ఆదివారం ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాణి మాట్లాడారు. ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేసి ఐక్యతను, సమగ్రతను చాలాని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ 12వ వార్డు కమిటీ అధ్యక్షుడు ఏరుకొండ అవినాష్, నాయకులు బండి సదానందం, సమ్మయ్య, ఏరుకొండ రాజమౌళి, కోడెల శ్రీనివాస్, కేశెట్టి వెంకటేశ్వర్లు, జక్కుల కుమార స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య ఇంటింటికీ జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేయాలని ఆకాంక్షించారు.

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిదని టీపీసీసీ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో శనివారం రాత్రి పల్లె నిద్ర చేసి ఆదివారం ఉదయం గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చేసిన అభివృద్ధి పనులు మాత్రమే కనిపిస్తున్నాయని అన్నారు. ఎన్నికల ముందు గ్రామాలను అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, గొర్లవీడు గ్రామ శాఖ అధ్యక్షులు ధరణి రమణాచారి, నాయకులు రామినేని రవీందర్, సదయ్య రమేష్, సురేష్, రాజిరెడి, రజనీకాంత్, తోట రంజిత్, తదితరులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు



బాలుడితో మాట్లాడుతున్న సీఐ వేణు చందర్

చిట్యాల: రోడ్డుపై నడిపేందుకు మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని సీఐ వేణుచందర్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలలో బాగంగా బాలుడిని పట్టుపట్టాడు. దీంతో అతని తల్లి దండ్రులను పిలిచి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణ కోసమే పోలీసులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. వాహన పత్రాలు కలిగి ఉండాలని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వనభోజనానికి తరలిన గ్రామస్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గ్రామస్తులు ఆదివారం వన భోజనాలకు వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జంపన్నవాగు వరదలకు ఊరట్టం గ్రామం పూర్తిగా ముంపునకు గురైన ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా వరదల నుంచి సురక్షితంగా బయటపడటంతో ఆదివారం గ్రామస్తులు సమీప అటవీ ప్రాంతంలోకి వన భోజనాలకు వెళ్లారు. సమ్మక్క సారలమ్మలు, ప్రకృతి దేవతలకు వనంలో పూజలు నిర్వహించి యాటలు, కోళ్లలను మొక్కుగా సమర్పించుకున్నారు. అనంతరం గ్రామస్తులు వనంలోనే వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

ఈటల రాజేందర్‌కు వినతి

శాయంపేట : మండలంలోని టీఎస్ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న అన్‌మ్యాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. హనుమకొండలో ఆదివారం జరిగిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మెదటి రాష్ట్ర మహాసభలకు ఎమ్మెల్యే రాజేందర్ హాజరు కాగా మండలానికి చెందిన అన్‌మ్యాన్ కార్మికులు కలిసి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ స్పందించారని కార్మికులు మీడియాకు తెలిపారు. తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే రాజేందర్ భరోసా ఇచ్చారని కార్మికులు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు అరుణ్, రాజు, కరుణాకర్, లక్ష్మణ్, కిరణ్, అర్జున్, వెంకటేష్, సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.